క్లుప్తంగా

వైభవంగా మట్టల పండుగ



తూర్పుక్రిస్టియన్‌పాలెంలో మట్టల పండుగలో పాల్గొన్న చిన్నారులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు తూర్పు క్రిస్టియన్ పాలెం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగ సందర్భంగా ఏసుక్రీస్తును రారాజుగా అభిశక్తున్ని చేసి ఊరేగించారు. ఈస్టర్ పండుగ ముందుగా వచ్చే ఆదివారం సంఘస్తులు చిన్నారులతో కలిసి క్రీస్తును స్తుతిస్తూ నగరంలో ప్రదర్శన నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం పండుగ జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘ కాపరి ప్రార్థన స్తుతి గీతాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీఈ సొసైటీ ఆధ్వర్యంలో...

నగరంలోని కబాడీపాలెంలో ఆదివారం సాయంత్రం సామూహికంగా చిన్నారులు పాల్గొని హోసన్నా జయం జయం అంటూ మట్టల ఆదివారం వేడుకలు జరుపుకున్నారు. కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ కట్టా రాజీవ్, నూకతోటి నాగరాజు, చైతన్య, చవల పీటర్, మున్ని, చిట్టి, అఖిల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



సీఈ సొసైటీ ఆధ్వర్యంలో మట్టల పండుగలో పాల్గొన్న క్రైస్తవులు

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం మేము సైతం

- ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేసి మంత్రి మేరుగు నాగార్జునకు సంఘీభావం
- సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలిపించాలని పార్టీ కార్యకర్తల పరిచయ వేదికలో మంత్రి మేరుగు పిలుపు



గాడిపర్తివారిపాలెంలో రాజీనామా పత్రాలను మంత్రి మేరుగు నాగార్జునకు సమర్పిస్తున్న వలంటీర్లు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పనిచేస్తామని, సంతనూతలపాడు ఎమ్మెల్యేగా మంత్రి మేరుగు నాగార్జునను గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని గాడిపర్తివారిపాలెంలో ఐదుగురు వలంటీర్లు వారి వలంటీర్ పదవులకు రాజీనామాలు చేశారు. ఆదివారం మంత్రి మేరుగు నాగార్జున పర్యటనలో వలంటీర్లు చల్లకొలుసుల ఏడుకొండలు, ఆరెద్దుల సాయికుమార్, తుపాకుల శ్రీను, బత్తుల కోటిరెడ్డి, సూడిదేల రాఘవరెడ్డి తమ వలంటీర్ పదవులకు రాజీనామాలు చేసి ఆ లేఖలను అందించారు. పార్టీ గెలుపుకోసం మంత్రి మేరుగు నాగార్జునకు వారు సంఘీభావం తెలిపారు. సోమవారం హోలీ పండుగ సందర్భంగా సెలవు కావడంతో వలంటీర్లు తమ రాజీనామా లేఖలను మంగళవారం చీమకుర్తిలోని ఎంపీడీఓకు అందించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గెలుపు కోసం వలంటీర్లు వారి పదవులను సైతం వదులుకోవడం పార్టీ పట్ల వారికున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లకు పార్టీ తరఫున ఎప్పుడూ తన అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం గ్రామంలో చిత్తశుద్ధితో పనిచేయాలని, వారి అభివృద్ధికి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తన వంతు కృషి చేస్తానని, వారి సేవలను మరిచిపోలేనని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేయాలని కోరారు. పథకాలు పొందిన లబ్ధిదారులకు ఆ మేరకు విజ్ఞప్తి చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు పొందని ఇల్లు లేదని ఇంటింటికి తిరిగి గుర్తు చేసి సంక్షేమ పథకాలు నిరంతరం అందాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని వివరించాలని కోరారు. సంతనూతలపాడు ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎర్రగుడిపాడు, పిడతలపూడి గ్రామాల్లో మంత్రి మేరుగు నాగార్జున పర్యటించి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులతో పరిచయ వేదికలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా మరోసారి రెపరెపలాడే విధంగా కృషిచేద్దామన్నారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, నాయకులు సూడిదేల విజయ భాస్కర్‌రెడ్డి, సూడిదేల సుబ్బరామిరెడ్డి, అయ్యవీరయ్య, గొడ్డటి ప్రసాద్, వెంగారెడ్డి, గంగిరేకుల వెంకట్రావు, ఓబుల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే యల్లయ్యకు ఘన నివాళులు...

కూనంనేనివారిపాలెంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వేమా యల్లయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి మేరుగు నాగార్జున పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంతనూతలపాడు నియోజకవర్గానికి వేమా యల్లయ్య చేసిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఎర్రగుడిపాడు గ్రామంలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

వలంటీర్ వ్యవస్థతో సంతోషంగా జీవిస్తున్నాం



నెహ్రూనగర్‌లో బాలినేని శచీదేవికి హారతిచ్చి ఆహ్వానిస్తున్న మహిళ

- ఏ పని ఉన్నా సొంత పిల్లల్లా మాకు సహాయం చేస్తున్నారు
- ఏ అధికారి వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సిన పని లేదు
- ఆలోచన కలిగిన నాయకుడు జగన్ నేడు జనం గుండెల్లో ఉన్నారు
- మహిళలతో మమేకం – స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు స్పష్టం

ఒంగోలు: 'వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలకు కడుపు మంట ఎందుకో అర్థం కావడం లేదు. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండేందుకే. కానీ, సొంత కుటుంబ సభ్యుల్లా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటున్న వలంటీర్లపై ఇష్టానుసారం మాట్లాడటం బాధ కలిగిస్తోంది' అని పలువురు మహిళలు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక 50వ డివిజన్‌లోని నెహ్రూనగర్ రామాలయం వద్ద నుంచి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి, స్థానిక 11వ డివిజన్‌లోని క్లోపేట 3వ లైను వద్ద నుంచి బాలినేని ప్రణీత్‌రెడ్డి సతీమణి శ్రీకావ్య ఆదివారం మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజల సమస్యలడిగి తెలుసుకోవడంతో పాటు వలంటీర్, సచివాలయ వ్యవస్థల వల్ల చేకూరిన లబ్ధి గురించి ప్రస్తావించారు. దీంతో వృద్ధులు మాట్లాడుతూ గతంలో పెన్షన్‌కు అర్హత పొందాలంటే ఎంత కష్టమో.. ప్రతి నెలా పెన్షన్ తీసుకోవాలంటే అంతకు రెట్టింపు కష్టంగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. తాము పెన్షన్ కోసం వెళ్తే సాయంత్రం అయినా ఇంటికి రాలేదని ఇంట్లో వాళ్లు ఆందోళన చెందేవారని తెలిపారు. కానీ, నేడు అలా కాకుండా వలంటీర్లు ఇంటికొచ్చి తలుపు తట్టి మరీ అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేయించి ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ డబ్బులిస్తుంటే ఆనందంగా ఉందని తెలిపారు. సీఎం జగన్‌కు ఇంతమంచి ఆలోచన వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. పెన్షన్ డబ్బు బ్యాంక్ ఖాతాలో వేయాలని కొంత మంది మేధావులు అంటున్నారని, అలా చేస్తే వాటిని తీసుకునేందుకు మళ్లీ ఏటీఎంలకు తిరిగే ఓపిక తమకు లేదని తెలిపారు. వృద్ధాప్యంలో మాకు ఇన్ని తిప్పలు అవసరం లేకుండా వలంటీర్లు ఇంటికొచ్చి ఇచ్చే పెన్షన్ డబ్బుతో ఎవరి వద్దా చేయి చాచకుండా గౌరవంగా బతికేందుకే పనికివస్తున్నాయని తెలిపారు. అలాంటి వ్యవస్థపై అవాకులు, చవాకులు పేలడం చూస్తుంటే కడుపు మండుతుందని బాలినేని శచీదేవి, శ్రీకావ్యలతో వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి అమ్మ ఒడి పథకంతో పాటు పలు సంక్షేమ పథకాల కింద నేరుగా డబ్బు బ్యాంకులో జమవుతుందని క్లోపేటలో ఓ చిరువ్యాపారి చెప్పుకొచ్చారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మళ్లీ గెలిచేది జగనే అని, ఒంగోలులో ప్రతి క్షణం అందుబాటులో ఉండే వాసన్నే అని చెప్పుకొచ్చారు. తప్పకుండా ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటామని మహిళలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శచీదేవి, శ్రీకావ్య మాట్లాడుతూ ఎవరైనా లేనిపోని హామీలిస్తుంటే వాస్తవాలను పరిశీలించుకోవాలన్నారు. తాము మంచి చేశాం కనుకనే ఓటు వేయమని అడుగుతున్నామని, కష్ట సమయంలో ఆదుకునేవారే నిజమైన ఆప్తులని గుర్తుంచుకోవాలని అన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మభ్యపెట్టే హామీలతో వచ్చే టీడీపీ వారిని నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని కోరారు. శచీదేవి వెంట స్థానిక కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, సుబ్బులు, సురేష్, శ్రీదేవి, ధనలక్ష్మి, తోటపల్లి రవి, చిన్నమ్మాయి, రాష్ట్ర టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభానీబీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, విజయ, వాణి, బత్తుల మరిమయ్య, గృహలక్ష్మి, రవణమ్మ, రాజేశ్వరి, రజని, కార్పొరేటర్ తాడి కృష్ణలత పాల్గొన్నారు. 11వ డివిజన్‌లో శ్రీకావ్య వెంట ఆ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు జాన్ ఇసాక్, ఉపాధ్యక్షుడు కావూరి కిరీటి, క్లోపేట క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్, కల్లం దీపక్, కోఆప్షన్ మెంబర్ శ్యాంసుందర్, చిట్టీ, నార్న్, ఆల్దా చైర్మన్ కోసూరి రాధ, గంటా రమ్య, వల్లెపు మురళి, నత్తల భీమేష్, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, దాసరి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఏఏ ర్యాలీకి హాజరుకానున్న అజీజ్ పాషా

ఒంగోలు టౌన్: దేశ ప్రజలను ఇక్కట్ల పాలు చేసే సీఏఏని వెంటనే ఉపసంహరించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ ఒంగోలులో వామపక్షాలు, ముస్లిం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ర్యాలీకి సీపీఐ జాతీయ కార్యదర్శి, ఇన్‌సాఫ్ జాతీయ అధ్యక్షుడు అజీజ్ పాషా హాజరుకానున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని శ్రీనివాసమహల్ రోడ్డులో గల సెయింట్ థెరిసా చర్చి దగ్గర నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని, నగర ప్రజలతో పాటు ఒంగోలు, కొత్తపట్నం, కొండపి, సంతనూతలపాడు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముస్లిం ప్రజాసంఘాల కరపత్రం ఆవిష్కరణ...

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ నగరంలోని ఇస్లాంపేట కమ్యూనిటీ హాలులో ముస్లిం ప్రజాసంఘాల నాయకులు ఆదివారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రశాంతంగా కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చుపెడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నల్లచట్టాలను తీసుకురావడాన్ని ప్రజలంతా తిప్పికొట్టాలని ఏఐటీయూసీ నాయకుడు ఎస్‌డీ సర్దార్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని కోరారు. ఈ నెల 30న నగరంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద గల మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు శాంతియుత నిరసన ప్రదర్శనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు ఎంఏ సాలార్, ఆవాజ్ నాయకులు సయ్యద్ హుసేన్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

చదలవాడకు కళామిత్ర పురస్కారం



లక్ష్మీనరసింహారావును సన్మానిస్తున్న కళామిత్ర మండలి సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక పద్య సారస్వత పరిషత్ సంస్థ భవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు, ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత, పద్యభారతి చదలవాడ లక్ష్మీనరసింహారావుకు కళామిత్ర ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆయన చేస్తున్న సాహిత్య సేవకు గుర్తింపుగా పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ సంస్థ అధ్యక్షుడు డా.నూనె అంకమ్మరావు తెలిపారు. ఈ సందర్భంగా నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ లక్ష్మీనరసింహారావు ప్రబంధ యుగకర్త ఎర్ర ప్రగడ అనే పరిశీలన గ్రంథంతో పాటు శ్రీగిరి వెంకటేశ్వర శతకం, పద్య భారతి ఖండకావ్యం, తెలుగు జాతీయములు నానుడులు పుట్టుపూర్వోత్తరములు, రోజుకో సూక్తి.. మొదలగు గ్రంథాలను రచించారని తెలిపారు. ఆయన సంప్రదాయబద్ధంగా పద్య కవిత్వం రాయడంలో గొప్పవారని, పద్య సాహిత్యంపై వారి సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేస్తున్నామని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ తెలిపారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు, ప్రముఖ కవి యు.వి.రత్నం, నటుడు దేనువకొండ సుబ్బారావు, సాహితీ పోషకులు ఓరుగంటి ప్రసాద్, పి.గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్స్ అనుభవాలు ఉపయుక్తం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఒంగోలు సెంట్రల్: ఇంజినీరింగ్ విద్యార్థులకు సీనియర్స్ అనుభవాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వక్తలు అన్నారు. స్థానిక రైజ్ కృష్ణసాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఆదివారం నాలుగో సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు మూడో సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించారు. కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, ఈసీఈ, సీఎస్సీ విభాగాల అధిపతులు ఎస్‌వీ రవి కుమార్, ఐజాక్ పాల్ పాల్గొన్నారు. విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న సాంకేతికతపై మరింత పట్టు సాధిస్తే జీవితంలో స్థిరపడతారని చెప్పారు. సీనియర్ విద్యార్థులు కళాశాలలో వారి అనుభవాలు పంచుకుని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు, భక్తులు

చీమకుర్తి: సంతనూతలపాడులో శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ వేడుకల మహోత్సవాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 27వ తేదీ ఉదయం 8.28 గంటలకు స్వామివారి ప్రతిష్ఠ వేడుకలను టీటీడీ పండితుడు ఎస్.జగదీశ్వర ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఆదివారం ప్రతిష్ఠ వేడుకల ప్రారంభోత్సవంలో 30 మంది దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



మద్దిరాలపాడులో అవగాహన కల్పిస్తున్న హెల్ప్ సంస్థ సభ్యులు

నాగులుప్పలపాడు: క్షయ వ్యాధి వ్యాప్తి, నివారణ, నిర్మూలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు మల్లేశ్వరి అన్నారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో మద్దిరాలపాడు గ్రామంలో ఆదివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ క్షయ వ్యాధి అనేది గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారు తగు జాగ్రత్తలతో వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాధ, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.





హోలీ సందడి



ఒంగోలు మెట్రో: స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల గాంధీ పార్కులో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఫ్రైడ్ మీడియా ఆధ్వర్యంలో హోలీ ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పూర్ణిమ ఘడియలు ప్రారంభమైన సందర్భంగా హోలీ పండుగ ఆగమన సంబరాలు నిర్వహించారు. హోలీ వేడుకల్లో చిన్నారులు, మహిళలు, యువత పాల్గొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు.

నేడు గాంధీ రోడ్డు, బండ్లమిట్టలో...

స్థానిక గాంధీ రోడ్డు, బండ్లమిట్టలో సోమవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. మార్వాడీలు, రాజస్థానీయులు, బెంగాలీలు కుటుంబ సమేతంగా ఒకరి మీద ఒకరు రంగులు చల్లుకుంటూ, సాటి వ్యాపారస్తులతో కలిసి హోలీ జరుపుకోనున్నారు. అనంతరం సామూహికంగా భోజనాలు ఏర్పాటు చేసుకుంటారు. ఇంట్లో ప్రత్యేకంగా దేవతారాధనలు చేస్తారు. హోలీ సందర్భంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సంతోషం కలిగించేందుకు రంగులు చల్లుకునే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. భారతీయులు ఎక్కడికి వెళ్లినా సంప్రదాయాలను మర్చిపోరని చెప్పడానికి ఉదాహరణగా నగరంలో స్థిరపడిన నార్త్ ఇండియా కుటుంబాలు ఏటా హోలీ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించుకుంటున్నారు.







గాంధీ పార్కులో హోలీ సంబరాల్లో సందడి చేస్తున్న యువత



